
సాక్షి
కామారెడ్డి
బుధవారం । 9 । ఏప్రిల్ । 2025



సాకారం చేసుకోవాలి
విద్యార్థులు కలలను సాకారం చేసుకోవడానికి కృషి చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచించారు.
- 8లో ▸



కళావిహీనంగా..
జిల్లాకేంద్రంలోని రాజీవ్ పార్క్‌ను బల్దియా అధికారులు పట్టించుకోకపోవడంతో కళావిహీనంగా తయారయ్యింది.
- 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
40.8 /20.9
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల వెల్లువ



కామారెడ్డి టౌన్: రాజీవ్ యువ వికాసం పథకానికి పట్టణంలోని అభ్యర్థులు మీసేవా కేంద్రాలలో భారీగా దరఖాస్తు చేసుకుంటున్నారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రం ఏర్పాటు చేశారు. మీ సేవాకేంద్రాలలో దరఖాస్తు చేసుకున్న వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలను సమర్పిస్తున్నారు. ఇప్పటి వరకు 1,500లకుపైగా దరఖాస్తులు వచ్చాయని సిబ్బంది తెలిపారు. ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువుంది.

కామారెడ్డి బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


నంద రమేశ్


సురేందర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ప్రక్రియ అసోసియేషన్ భవనంలో ఎన్నికల అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్షుడిగా నంద రమేశ్, ప్రధాన కార్యదర్శిగా బండారి సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మురళి, సంయుక్త కార్యదర్శిగా మోహన్‌రెడ్డి, కోశాధికారిగా వేణు ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సలీం, అగ్రజ్, విఠల్‌రావు, అన్సార్, యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి తెలిపారు.

రేపు బాన్సువాడకు ఎమ్మెల్సీ కవిత రాక

బాన్సువాడ : ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం బాన్సువాడకు రానున్నారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. పట్టణంలోని ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఆర్టీసీ సిబ్బందికి 'ప్రగతి చక్రం' పురస్కారాలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు మంగళవారం 'ప్రగతి చక్రం' పురస్కారాలను అందించామని ఆర్ఎం జ్యోత్స్న తెలిపారు. ఉత్తమ సిబ్బందికి త్రైమాసిక పురస్కారాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం ఎస్ మధుసూదన్, డిపో మేనేజర్లు, పర్సనల్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలకు తోడు నీటి వినియోగం పెరగడంతో జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతోంది. నెల రోజుల్లో జిల్లాలో సరాసరిన 2.05 మీటర్ల లోతుకు తగ్గాయి. వేగంగా భూగర్భ జలాలు పడిపోతుండడంతో బోరుబావులు ఎత్తిపోతున్నాయి. దీంతో సాగు నీరందక పంటలు ఎండుతున్నాయి.

మరింత లోతుకు..

నెలలో 2.05 మీటర్లు తగ్గిన భూగర్భ జలాలు ● ఎత్తిపోతున్న బోరుబావులు


శేర్‌ఖాన్‌పల్లిలో ఎత్తిపోయిన బోరుబావి


శేర్‌ఖాన్‌పల్లిలో బోరుబావి నుంచి సన్నటి ధారగా వస్తున్న నీరు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. అధికారులు ప్రతినెల చివరలో భూగర్భ జలమట్టం లెక్కలు తీస్తారు. మార్చి నెలాఖరులో తీసిన లెక్కల ప్రకారం జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పడిపోయింది. జిల్లాలో సరాసరి భూగర్భ జలమట్టం ఫిబ్రవరిలో 12.97 మీటర్లు ఉండగా మార్చిలో 15.02 మీటర్ల లోతుకు పడిపోయింది. అంటే నెల రోజుల్లో 2.05 మీటర్లు పడిపోయినట్టు స్పష్టమవుతోంది. గతేడాది మార్చిలో 14.47 మీటర్ల లోతు నీరుండేది. అంటే గతేడాది మార్చికన్నా ఈ ఏడాది మార్చిలో 0.55 మీటర్ల లోతుకు వెళ్లాయి. బీబీపేట, దోమకొండ, గాంధారి, తాడ్వాయి, పిట్లం మండలాల్లో భూగర్భ జలమట్టం ప్రమాదకర స్థాయికి పడిపోయింది. ఆయా ప్రాంతాల్లో 20 మీటర్లకన్నా లోతుల్లోకి వెళ్లాయి. భిక్కనూరు, రామారెడ్డి, లింగంపేట, రాజంపేట, నాగిరెడ్డిపేట, పెద్దకొడప్‌గల్, ఎల్లారెడ్డి మండలాల్లో 15 మీటర్ల నుంచి 20 మీటర్ల లోతులో నీరుంది. మరి కొన్ని రోజుల్లో భూగర్భ జలమట్టం మరింత కిందికి పడిపోయే అవకాశం ఉందని భూగర్భ జలశాఖ అధికారులు చెబుతున్నారు.

పాతాళంలో నీరు..

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పాతాళానికి చేరింది. గోద్మెగాంలో 37.08 మీటర్ల లోతుకు పడిపోయింది. కన్నాపూర్‌లో 35.53 మీటర్లు, గుర్జాల్‌లో 35.23, పెద్ద దడ్గిలో 34.55, మల్లుపల్లిలో 33.58, బంజర తండాలో 27.75, అంచనూరులో 27.62, బీబీపేటలో 25.38, మోతెలో 25.12, సిద్దాపూర్‌లో 25.06, అన్నారంలో 24.68, సర్వాపూర్‌లో 24.63, వెల్గనూరులో 21.62, అడ్లూర్‌లో 20.47, కుర్తిలో 20.05 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నాయి.

పొదుపుగా వాడుకోవాలి

విచ్చలవిడి నీటి వాడకం మూలంగా సమస్యలు పెరుగుతున్నాయి. ఈసారి జిల్లాలో భూగర్భ జలమట్టం వేగంగా పడిపోయింది. వరి సాగుకు ఎక్కువ నీరు అవసరం ఉంటుంది. వర్షాకాలంలో వరి సాగు చేసిన రైతులు యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టడం ద్వారా సమస్య తలెత్తకుండా చూసుకోవచ్చు. తాగునీటి విషయంలోనూ పొదుపు పాటించాలి. నీటిని వృథా చేయొద్దు. భూగర్భ జలమట్టం పెరగాలంటే ఇళ్ల వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి.

– సతీశ్‌యాదవ్, జిల్లా భూగర్భజలశాఖ అధికారి

తాగు, సాగునీటికి కష్టాలు..

జిల్లాలో భూగర్భ జలమట్టం పాతాళానికి చేరడంతో బోర్లు ఎత్తిపోతున్నాయి. బీబీపేట, దోమకొండ, మాచారెడ్డి, పాల్వంచ, రామారెడ్డి, సదాశివనగర్, గాంధారి, తాడ్వాయి, రాజంపేట, లింగంపేట, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, పిట్లం, పెద్దకొడప్‌గల్ తదితర మండలాల్లో భూగర్భ జలాలు పాతాళానికి చేరడంతో ఊటలు తగ్గిపోయి బోర్లు ఎత్తిపోతున్నాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా కష్టాలు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే వరి కోతకు రాగా, చాలా చోట్ల ఇంకా పొట్టదశలో ఉంది. పంటకు కీలకమైన సమయంలో నీరు అందకుండా పోతుండడంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్తగా బోర్లు తవ్వించి అప్పుల పాలవుతున్నారు. ఇదే సమయంలో తాగునీటికీ ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్, శ్రీరాంనగర్, కాకతీయనగర్, ఎన్జీవోస్ కాలనీ, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో వందలాది బోర్లు ఎత్తిపోయి నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాగునీటి సమస్య ఉన్న చోట్ల అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

'నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి'


ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో చందర్ నాయక్

సదాశివనగర్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీ సీ ఈవో, మండల ప్రత్యేకాధికారి చందర్ నా యక్ సూచించారు. మంగళవారం వజ్జపల్లి లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులకు పలు సూచనలు ఇచ్చా రు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మాధవీలత, మాజీ సర్పంచ్ ఎర్రం నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు గాదె చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

కామారెడ్డి క్రైం: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ రాజేశ్ చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో 129 రోడ్డు ప్రమాదాలు జరిగాయని పేర్కొన్నారు. ఆయా ప్రమాదాలలో 58 మంది మృతిచెందారని, 122 మంది క్షతగాత్రులయ్యారని తెలిపారు. మూడు నెలల కాలంలో ప్రత్యేక తనిఖీల ద్వారా 1.19 లక్షల చలాన్లు విధించామని పేర్కొన్నారు. ఇందులో 3,026 డ్రంక్ అండ్ డ్రైవ్, 8,868 ఓవర్ స్పీడ్, 8,069 స్పీడ్ గన్ చలాన్లు ఉన్నాయని వివరించారు. హెల్మెట్, సీటు బెల్ట్ ధరించని 89,936 మందికి జరిమానాలు విధించామని వివరించారు. జిల్లా ప్రజలు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ప్రమాదాల నివారణకు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

సంపన్నులతో సమానంగా పేదింట సన్న అన్నం


గిరిజన లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

గాంధారి: సంపన్నులతో సమానంగా పేదలు కూడా మంచి భోజనం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తోందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పెద్ద గుజ్జుల్ తండాను సందర్శించారు. ఈ సందర్భంగా తండాకు చెందిన బానోత్ వినోద్ అనే గిరిజనుడి ఇంట్లో పలువురు అధికారులతో కలిసి భోజనం చేశారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఆదాయ మార్గాలు, ఆర్థిక పరిస్థితి, పిల్లల చదువులు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. వినోద్ తనకు బోర్‌వెల్ సమస్య ఉందని కలెక్టర్‌తో తెలుపగా విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్‌ను ఆదేశించారు. తండాలో ఏమైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు. అనంతరం తండావాసులు కలెక్టర్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, డీపీవో మురళి, తహసీల్దార్ రేణుక చౌహాన్, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం సందర్శించారు. గోదాంకు వేసిన సీల్, గోదాం వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, తహసీల్దార్ జనార్దన్, ఎన్నికల విభాగం అధికారులు సరళ, అనిల్ కుమార్ తదితరులున్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో మంగళవారం పోషణ పక్షం పోస్టర్‌ను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ వరకు నిర్వహించే పోషణ పక్షోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చందర్ నాయక్, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, కామారెడ్డి సీడీపీవో శ్రీలత, మద్నూర్ సీడీపీవో కళావతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మరో 10 సహకార సంఘాలు..


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: జిల్లాలో మరో 10 వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంఘాలను పునర్వ్యవస్థీకరించాలని జిల్లా సహకార అభివృద్ధి కమిటీ నిర్ణయించిందన్నారు. మరో 10 సింగిల్ విండోల ఏర్పాటు ప్రతిపాదనలను రాష్ట్ర స్థాయి కమిటీకి పంపిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, డీఆర్‌డీవో సురేందర్, డీసీవో రామ్మోహన్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, డీఏవో తిరుమల ప్రసాద్, డీఎఫ్‌వో శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

గౌరారం కలాన్‌లో కలకలం


బాధితుడిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి


బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

- కల్లు తాగిన పలువురికి అస్వస్థత
- బాన్సువాడ ఆస్పత్రికి తరలింపు


గాంధారి: గౌరారం కలాన్‌లో మంగళవారం కల్లు తాగిన పలువురు అస్వస్థతకు గురయ్యారు. బాధితులను చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తులు, అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గౌరారం కలాన్‌లో మంగళవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు మధ్యాహ్నం కల్లు తాగారు. ఆ కల్లు తాగిన కొందరు సాయంత్రం నుంచి నాలుక మొద్దుబారడంతోపాటు మెడనొప్పితో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు అధికారులకు తెలపగా.. ఆర్ఐ ప్రదీప్, ఎస్సై ఆంజనేయులు, వైద్యారోగ్య, ఎక్సైజ్ శాఖల అధికారులు గ్రామాన్ని సందర్శించి పరిస్థితి తెలుసుకున్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం 12 మంది బాధితులను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు. రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామంలోనే ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

కోలుకుంటున్న కల్తీ కల్లు బాధితులు


ఆస్పత్రిలో కల్తీకల్లు బాధితులను పరామర్శిస్తున్న పోచారం, కాసుల, సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ : కల్తీ కల్లు సేవించి అస్వస్థతకు గురై బాన్సువాడ ఆస్పత్రిలో చేరినవారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. వైద్య సేవలు అందడంతో వారంతా కోలుకుంటున్నారు. నస్రుల్లాబాద్ మండలం దుర్కి కల్లు డిపో పరిధిలో ఉన్న కల్లు దుకాణాల్లో సోమవారం కల్తీ కల్లు తాగి 60 మంది ఆస్పత్రి పాలైన విషయం తెలిసిందే. కల్తీ కల్లు సేవించిన అరగంటకు మెడలు వంగిపోవడం, నాలుక దొడ్డుగా మారడం, కళ్లు తేలేయడం వంటి లక్షణాలను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాన్సువాడ ఆస్పత్రికి తీసుకువచ్చారు. బాధితుల్లో పిల్లలు కూడా ఉన్నారు. మెరుగైన వైద్య సేవలు అవసరం అయిన 12 మందిని నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించారు. సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ఆస్పత్రిని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఆస్పత్రిలో వైద్యులు అందించిన సేవలతో బాధితులు కోలుకున్నారు. కాగా రోజూ కల్లు తాగుతామని, ఇలా ఎందుకు అయ్యిందో అర్థం కావడం లేదని బాధితులు పేర్కొన్నారు. కల్లులో మత్తు పదార్థాలు ఎక్కువగా కలపడంతోనే ఆ కల్లు సేవించినవారు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైనట్లు తెలుస్తోంది.

గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు


అంకోల్‌లో సర్వే చేస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది

నస్రుల్లాబాద్: ఆరోగ్య శాఖ సిబ్బంది మంగళవారం అంకోల్, అంకోల్ తండా, దుర్కి, దామరంచ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. ఆయా గ్రామాలకు చెందిన పలువురు సోమవారం కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురయిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ.. ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తోంది. వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు పంపిస్తున్నామని వారు తెలిపారు. మంగళవారం ఎటువంటి ఘటనలు చోటు చేసుకోలేదని అంకోల్ సబ్‌సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ మనీష తెలిపారు. సోమవారం అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరినవారి పరిస్థితి నిలకడగా ఉందని, కొందరు డిశ్చార్జి అయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు స్రవంతి, వెంకటలక్ష్మి, శ్రావణి, ఉమ, ఆశా కార్యకర్తలు శిరీష తదితరులు పాల్గొన్నారు.

23 మందిపై కేసులు

బాన్సువాడ : దుర్కి కల్తీ కల్లు ఘటనలో 23 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు. సోమవారం బాన్సువాడ ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దుర్కి కల్లు డిపోకు సంబంధించిన కల్లు సేవించి 60 మంది అస్వస్థతకు గురయ్యాయరన్నారు. వారినుంచి నార్కొటిక్ బృందం శాంపిల్స్ సేకరించిందని, రిపోర్టు వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దుర్కిలో అనుమతి లేకుండా ఉడతల సురేందర్‌గౌడ్ అనే వ్యక్తి కల్లు డిపో కొనసాగిస్తున్నారని, ఈ కల్లు డిపో నుంచి అంకోల్, దుర్కి, బీర్కూర్ మండలం దామరంచ గ్రామాలకు కల్లు సరఫరా చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఆయా గ్రామాల్లో 18 టీఎఫ్‌టీ లైసెన్సులు కలిగి ఉన్నారన్నారు. ఆ లైసెన్సు కలిగిన కల్లు దుకాణాలకు దుర్కి కల్లు డిపో నుంచి కల్లు సరఫరా చేస్తున్నారన్నారు. 18 టీఎఫ్‌టీ లైసెన్సులను రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు. దుర్కిలో అనుమతి లేకుండా డిపో కొనసాగిస్తున్న సురేందర్‌గౌడ్, ఆయన తండ్రి లక్ష్మాగౌడ్, మేనల్లుడు ఆకాష్‌గౌడ్‌లతో పాటు మరో 20 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ ఘటనపై అసిస్టెంట్ కమిషనర్ హన్మంత్‌రావు పూర్తి వివరాలు సేకరిస్తారని, తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి : పోచారం

బాన్సువాడ : కల్తీ కల్లు కేసులో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎక్సైజ్ అధికారులకు సూచించారు. మంగళవారం బాన్సువాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కల్తీ కల్లు బాధితులను ఆయన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయిలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కల్తీ కల్లు తాగి ఆస్పత్రుల పాలైనవారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందన్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఎక్సైజ్ కమిషనర్ హన్మంత్‌రావు, బీర్కూర్ ఏఎంసీ చైర్మన్ శ్యామల, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, ఎజాస్, అఫ్రోజ్, అజీం, శంకర్ ఉన్నారు.

క్లుప్తంగా

అపూర్వ సమ్మేళనం



భిక్కనూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1978–79 సంవత్సరం పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఒకరిని ఒకరు పలకరించుకుంటూ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు.

'డిగ్రీ చదువుతోపాటు వృత్తి శిక్షణ ప్రశంసనీయం'



కామారెడ్డి అర్బన్: డిగ్రీ చదువుతో పాటు టైలరింగ్, ఆఫీస్ ఆటోమేషన్, ఎంఎస్ వర్డ్, ఎక్సెల్ 45 రోజుల శిక్షణ పూర్తి చేసుకోవడం, నైపుణ్యాలు సంపాదించడం ప్రశంసనీయమని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ అన్నారు. కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్, కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు వేర్వేరుగా 45రోజుల సర్టిఫికెట్ కోర్సుల ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు విశ్వప్రసాద్, జయప్రకాష్, శ్రీవల్లి, రాజేందర్, జి.శ్రీనివాస్‌రావు, ఫర్హీన్‌ఫాతిమా, శ్రీలత, అఫ్రీన్‌లు పాల్గొన్నారు.

రోడ్లపైనే ధాన్యం ఆరబోత



మద్నూర్(జుక్కల్): రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్, కుర్లా, మదన్‌హిప్పర్గా రైతులు రోడ్డులోని సగం భాగం ధాన్యాన్ని ఎండబెడుతున్నారు. దీంతో రెండు వైపుల ఒకేసారి వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. రాత్రి సమయాల్లో రోడ్లపై పోసిన ధాన్యాన్ని గమనించని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై అధికారులు పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

కల్తీ కల్లుతో ప్రయోగాలు!

ప్రజల ప్రాణాలతో చెలగాటం

- దుర్కిలో కల్తీకల్లు తాగి పలువురికి అస్వస్థత
- జీజీహెచ్‌లో చికిత్స అందిస్తున్న వైద్యులు



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కల్తీ కల్లు బాధితులు

నిజామాబాద్‌నాగారం: సంపాదనే ధ్యేయంగా కల్లు వ్యాపారులు ఇష్టారీతిన కల్తీ కల్లు తయారు చేస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కల్తీ కల్లు తయారు చేయడంలో ప్రయోగాలు చేస్తూ ఏళ్ల తరబడిగా క్లోరోహైడ్రేట్, అల్ప్రాజోలం, డైజోఫామ్ తదితర మత్తు పదార్థాలు వాడుతున్నారు. దీంతో ఆ కల్తీకల్లు తాగిన ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఇటీవల నస్రుల్లాబాద్ మండలం దుర్కిలో కల్తీకల్లు తాగి పలువురు అస్వస్థతకు గురయ్యారు. వారిలో కొంతమందిని చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించగా, మరికొంతమందిని నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించారు.

72గంటలు వైద్యుల పర్యవేక్షణలోనే..

దుర్కిలో కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైన వారిలో శివలక్ష్మి, బుజ్జీ, లక్ష్మణ్, నరేష్, తులసవ్వ, అర్వింద్, లచ్చవ్వ, కాశీరాం, రవి, మారుతి, మోహన్, బాలమణి, మధు, నాగర్జున్‌లు జీజీహెచ్‌లో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

బాధితులను వైద్యులు పరీక్షించగా, కల్లు వ్యాపారులు ప్రయోగాలు చేయడానికి యాంటి సైకియాట్రిక్ గ్రూప్స్‌కు సంబంధించిన కొత్త మందును కలిపినట్లు వైద్యులు అనుమానం వ్యక్తం చేశారు. అందువల్లే బాధితులు తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కోలుకోవడానికి 72గంటల సమయం పడుతుందని మంగళవారం తెలిపారు. ఈ కల్తీ కల్లు తాగడం వల్ల బాధితులకు గంటల వ్యవధిలోనే నాలుక దొడ్డుగా మారడం, సిరలు పడిపోవడం, నొప్పులు తదితర వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు వారిని హుటాహుటిన ఆస్పత్రులకు చికిత్స నిమిత్తం తరలించారు. కల్తీ వ్యాపారులకు, అక్రమార్కులకు పేదల ప్రాణాలంటే లెక్కలేకుండా పోయిందని పలువురు మండిపడుతున్నారు. కల్లులో ప్రయోగాలు చేయడంలో ఎవరైనా చనిపోతే రూ. 20వేల నుంచి రూ. 80వేల వరకు కుటుంబ సభ్యులకు ముట్టజెప్పి చేతులు దులుపుకున్న ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, కల్తీకల్లు విక్రయాలను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

మాట్లాడ రాలేదు..



కల్తీకల్లు తాగిన కొద్దిసేపటికే నాలుక దొడ్డుగా అయ్యింది. మాట్లాడటం రాలేదు. సిరలు మొత్తం పడిపోయాయి. మా నాన్న చూసి వెంటనే నన్ను ఆస్పత్రికి తీసుకవచ్చి చికిత్స అందించారు.

– అర్వింద్, కల్తీకల్లు బాధితుడు

నా ప్రాణం ఆగమైంది..



ఎప్పటి మాదిరిగానే కల్లు తాగగా, గంటల వ్యవధిలోనే నా ప్రాణం ఆగమైంది. మెడ సిరలు పడిపోయాయి. శరీరమంతా నొప్పులు, నడవకలేక పోయాను. నాలుక సైతం దొడ్డుగా మారింది. కల్లులో ఏదో కలపడంతోనే నాకు ఇలా జరిగింది. నాతో పాటు చాలా మందికి ఇదే పరిస్థితి ఎదురైంది.

– మోహన్, కల్తీకల్లు బాధితుడు

నడవలేక పోయాను..



ప్రతిరోజు నేను కల్లు తాగుతాను. కానీ ఈసారి తాగిన కొద్దిసేపటికే నా సిరలు పక్కకు పడిపోయాయి. నడవలేకపోయాను. ఏం జరుగుతుందో కూడా తెలియదు. ప్రస్తుతం కొద్దిగా మంచిగా ఉన్నాను. వైద్యుల వల్ల నా ఆరోగ్యం కాస్త కుదుటపడుతుంది.

– లక్ష్మణ్, కల్తీకల్లు బాధితుడు

కొత్త మందు కలపడంతోనే..

కల్లు తాగిన వారిని రకరకాలుగా పరిశీలించాం. కల్లులో అల్ప్రాజోలం, డైజోఫామ్ కలిపితే మత్తు వస్తుంది. కానీ ఇందులో కొత్త మందు కలపడంతోనే బాధితుల్లో అనారోగ్య సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. ప్రస్తుతానికి వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. మరో 72గంటల పాటు వారిని మా పర్యవేక్షణలో ఉంచుకొని, వారి ఆరోగ్యం కుదుటపడిన తర్వాత డిచ్చార్జ్ చేస్తాం.

– శ్రీనివాస్, సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, నిజామాబాద్

ఆధార్ కార్డులో పేరు మార్చారని ధర్నా

రాజంపేట: తన ఆధార్ కార్డుతోపాటు, రేషన్‌కార్డులలో పేర్లు మార్పు చేశారంటూ ఓ మహిళా ధర్నా చేపట్టిన ఘటన రాజంపేటలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా.. సదరు మహిళ బీఆర్‌ఎస్ నాయకుడితో గతంలో సహజీవనం చేసింది. ఫలితంగా ఓ కొడుకు పుట్టగా, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాఠశాలలో తండ్రి పేరు సంబంధిత వ్యక్తి పేరే ఉండేది. కానీ ఇటీవల తనకు తెలియకుండా తండ్రి పేరు స్థానంలో ఇతర వ్యక్తి పేరు చేర్చారంటూ ఆందోళన చేపట్టింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆమెకు సర్దిచెప్పారు. ఫిర్యాదు చేస్తే న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ విషయమై ఎస్సై పుష్పరాజ్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. గతంలో ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, పెద్దమ్మల అంజమ్మ అనే మహిళ 2007లో సంబంధిత వ్యక్తిపై కేసు పెట్టిందని, తిరిగి 2008లో రాజీ పడినట్లు తమ రికార్డులో ఉన్నట్లు పేర్కొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలం బిక్కనూర్ గ్రామానికి చెందిన సందీప్ రెడ్డి(25) అనే యువకుడు గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన సునీత–మహేశ్వర్‌రెడ్డి దంపతుల రెండో కుమారుడు సందీప్‌రెడ్డికి పుట్టుకతోనే గుండెకు రంధ్రం ఉంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2004లో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గుండెకు సర్జరీ చేశారు. 20 ఏళ్ల తరువాత మళ్లీ ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించడంతో నాలుగు రోజుల క్రితం గుండె ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ అనంతరం సోమవారం రాత్రి గుండె పోటు రావడంతో మృతి చెందాడు.

విద్యార్థి కలలను సాకారం చేసుకోవాలి



ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాసిన కథల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే



లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

- టీహబ్ తరహాలో ఎల్లారెడ్డిలో వై హబ్ ఏర్పాటు
- ఎమ్మెల్యే మదన్మోహన్ రావు

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్ : ప్రతి విద్యార్థి కన్న కలలను సాకారం చేసుకోవడానికి కృషి చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు అన్ని రంగాలలో ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులు కథల పుస్తకాలు రాయడం సంతోషాన్ని కలిగించిందన్నారు. టీహబ్ తరహాలో ఎల్లారెడ్డిలో వై హబ్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నానని, ఇందుకోసం 50 ఎకరాల స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను కోరానని తెలిపారు. కళాశాలకు ప్రభుత్వం కేటాయించిన 23 ఎకరాల భూమిలో ఒక్క అంగుళం కూడా కబ్జా కాకుండా చూస్తానన్నారు. కబ్జాకు పాల్పడిన వారి నుంచి భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. విద్యార్థులు రాసిన కథల పుస్తకాలు, కళాశాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. డిగ్రీ కళాశాలలో డ్రెయినేజీ నిర్మాణానికి రూ.30 లక్షలు కేటాయిస్తున్నానని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని ఏఈకి సూచించారు. కళాశాలకు స్వాగత తోరణం నిర్మాణానికి కళాశాల అభివృద్ధి కమిటీ ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. పట్టణంలో రూ. 5లక్షలతో నిర్మించనున్న టీఎన్‌జీవో కార్యాలయ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేటలో జరుగుతున్న అమృత్ 2.0 పనులను ఆయన పరిశీలించారు. రూ. 35 కోట్లతో పనులు జరుగుతున్నాయని, నాణ్యతగా చేపట్టాలని సూచించారు.ఎల్లారెడ్డి మండలం మండలం సాతెల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఎల్లారెడ్డి మండలం రుద్రారం గ్రామంలోని చాకలి సాయిలు అనే లబ్ధిదారుడి ఇంట్లో ఎమ్మెల్యే భోజనం చేశారు. ఎల్లారెడ్డి మండలం మత్తమాల గ్రామంలో ఎమ్మెల్యే, జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులతో కలిసి పాదయాత్ర చేశారు కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శంకర్, చంద్రకాంత్, ప్రభాకర్, సిద్దు, వసంత లక్ష్మి, గంగారెడ్డి, ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాస్‌రావు, సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేష్, సీడీసీ సభ్యులు శ్రీనివాస్, కంచర్ల బాలకిషన్, ముత్యపు సుదర్శన్, విద్యాసాగర్, ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత, మున్సిపల్ మాజీ చైర్మన్లు పద్మశ్రీకాంత్, కుడుముల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు వినోద్‌గౌడ్, సాయిబాబా, కాంగ్రెస్ నాయకులు, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, తాలుకా అధ్యక్షులు మహిపాల్, కార్యదర్శి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన



భిక్కనూరు: విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు మంగళవారం విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమాలను నిర్వహించారు.జీవో 21 తీసుకవచ్చి కాంట్రాక్టు అధ్యాపకుల పొట్ట కొట్టడం ఎంత వరకు సమంజసమని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర కో–ఆర్డినేషన్ కమిటి సభ్యుడు డాక్టర్ ఎస్.నారాయణ అన్నారు. సౌత్ క్యాంపస్ భవనం ముందర ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ యాలాద్రి, సునీత, రమాదేవి, నర్సయ్య, సరిత, నిరంజన్‌శర్మ, శ్రీకాంత్,దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ పార్టీపై బీజేపీ, బీఆర్‌ఎస్‌లు అసత్యపు ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పంపరి లక్ష్మణ్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హెచ్‌సీయూ భూముల వ్యవహారంలో ప్రభుత్వంపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు.

అంబేడ్కర్ జయంతి బ్రోచర్ ఆవిష్కరణ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ఈనెల 14న అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెయూ వీసీ యాదగిరిరావు అన్నారు. ఈమేరకు మంగళవారం తెయూలో కార్యక్రమ బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ.. కార్యక్రమంలో కీలకోపన్యాసం చేయడానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ లింబాద్రి హాజరవుతున్నారని తెలిపారు. ప్రిన్సిపల్ ప్రవీణ్ మామిడాల, ఎస్సీ సెల్ డైరెక్టర్ వాణి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇంటిని కూల్చిన కేసులో నలుగురి రిమాండ్

వేల్పూర్: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గత నెలలో బచ్చు గంగాధర్ అనే వ్యక్తి ఇంటిని అక్రమంగా కూల్చిన కేసులో మంగళవారం నలుగురు గ్రామస్తులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. మచ్చర్ల నర్సారెడ్డి, ఏనుగు మోహన్ రెడ్డి, రిక్క రాజేశ్వర్, ఏనుగు నర్సారెడ్డి లను రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో ఇప్పటికే నిజామాబాద్ జైల్లో కొందరు రిమాండ్‌లో ఉండగా, మరికొంత మంది పరారీలో ఉన్నారని వెల్లడించారు.

వృద్ధుడి అదృశ్యం



మాచారెడ్డి: ఎల్లంపేట గ్రామానికి చెందిన మాలోత్ రాజ్య(60) అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఎస్సై అనిల్ మంగళవారం తెలిపారు. మార్చి 31న మహారాష్ట్రలోని పౌరాదేవి దర్శనం కోసం వెళ్లిన రాజ్య ఇప్పటికీ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వెలగని సెంట్రల్ లైటింగ్

అటెన్షన్ ప్లీజ్..



కామారెడ్డి టౌన్ : పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ దీపాలు అక్కడక్కడ వెలుగులకు నోచుకోవడం లేవు. నెలల తరబడి దీపాలు చెడిపోయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. మంగళవారం స్టేషన్‌రోడ్, సిరిసిల్లా రోడ్‌లలో అక్కడక్కడా దీపాలు వెలగక పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అయితే ప్రకటనల బోర్డులకు మాత్రం అంతరాయం కలగకుండా దీపాలు వెలుగుతుండటం గమనార్హం.

క్రైం కార్నర్

చెరువులో పడి ఒకరి మృతి

ఇందల్వాయి: మండలంలోని గండి తండాలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని గండితండాకు చెందిన విస్లావత్ నరేందర్ (43) సోమవారం రాత్రి తన పొలం వద్ద ఉన్న బర్రెలకు నీరు పెట్టడానికి ఇంటి నుంచి వెళ్లాడు. ఈక్రమంలో పొలం పక్కన ఉన్న చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. ఈమేరకు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి వృద్ధుడు..

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి శివారులో ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా.. లింగాపూర్ గ్రామానికి చెందిన చెట్కూరి ఎల్లయ్య (85) కొద్ది రోజులుగా వృద్ధాప్య కారణాలతో మతిస్థిమితం కోల్పోయాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చాలాచోట్ల గాలించిన ఆచూకీ దొరకలేదు. దేవునిపల్లి శివారులోని బండారి రాజిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న బావిలో ఎల్లయ్య మృతదేహం మంగళవారం తేలింది. సమాచారం అందుకున్న దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి భార్య మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి పట్టాలు దాటుతూ రైలు ఢీకొని మృతి చెందినట్లు నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయారెడ్డి మంగళవారం తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. మృతుడు సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉంటాడన్నారు. నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ దుర్గాప్రసాద్ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే నిజామాబాద్ రైల్వే పోలీస్ ఫోన్ నంబర్ 8712652591కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

చికిత్స పొందుతూ ఒకరు..

రెంజల్(బోధన్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై చంద్రమోహన్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. నవీపేట మండలం నాగేపూర్ గ్రామానికి చెందిన మద్దెల మదారి(41)అనే వ్యక్తి సోమవారం అర్ధరాత్రి అత్తగారి ఊరైన రెంజల్ మండలంలోని నీలా గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో తాడ్‌బిలోలి గ్రామం వద్ద వడ్ల బస్తాలను ఢీకొనడంతో కిందపడి గాయపడ్డాడు. స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



బిచ్కుంద(జుక్కల్): వాహదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. బిచ్కుంద అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించి, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. తల్లిండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.

వేర్వేరు కేసుల్లో పలువురికి జైలుశిక్ష

మోపాల్: డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఒకరికి నిజామాబాద్ ప్రత్యేక ద్వితీయశ్రేణి న్యాయమూర్తి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. మోపాల్‌లో ఈనెల 4న పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, జిల్లాకేంద్రానికి చెందిన రహమత్ పాష మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి 3రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు.

డిచ్‌పల్లిలో ఒకరికి..

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగ్‌పూర్ గేట్ సమీపంలో ఈ నెల 5న ఎస్సై ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. దెగావత్ శివరాం (గాంధీ నగర్ కాలనీ), చొక్కల రాకేష్ (సుద్దపల్లి), దేశెట్టి సాయికుమార్ (కమలాపూర్) మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్టేట్ మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

టీస్టాల్ నిర్వాహకుడికి..

బోధన్‌టౌన్(బోధన్): సమయపాలన పాటించకుండా హోటల్ నిర్వహిస్తున్న యజమానికి బోధన్ కోర్టు ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ మంగళవారం తెలిపారు. పట్టణంలోని రెంజల్‌బేస్ కాలనీలో టీస్టాల్ నిర్వహిస్తున్న అబ్దుల్ మజీద్ అనే వ్యక్తి రాత్రి 10:30 గంటల తర్వాత హోటల్ నిర్వహిస్తుండటంతో పోలీసులు అతడిని పట్టుకున్నారు. అనంతరం అతడిని బోధన్ కోర్టులో హాజరు పరుచగా జడ్జి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

న్యూసెన్స్ కేసులో ఒకరికి..

మాక్లూర్: మద్యం తాగి, మత్తులో తరచూ డయల్ 100కు కాల్ చేసి, పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తికి కోర్టు 2రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై రాజశేఖర్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మొద్దు గంగాధర్ 3 రోజులుగా మద్యం మత్తులో డయల్ 100కు ఫోన్ చేస్తూ పోలీసు విధులకు ఆటంకం కల్గించటమే కాకుండా ప్రజల్ని ఇబ్బందికి గురిచేశాడు. దీంతో పోలీసులు అతడిని పట్టుకొని కోర్టులో హాజరుపర్చారు. జడ్జి విచారణ జరిపి అతడికి 2రోజుల జైలు శిక్షవిధించినట్లు ఎస్సై తెలిపారు.

నగరంలో ఐస్‌క్రీం షాప్ నిర్వాహకుడికి..

ఖలీల్‌వాడి: నగరంలో అర్ధరాత్రి వరకు షాపు తెరచిఉంచిన నిర్వాహకుడికి జిల్లా కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. దేవిరోడ్డులోని శివశక్తి ఐస్‌క్రీం షాప్‌ను నిర్వాహకుడు అర్ధరాత్రి వరకు తెరచిఉంచడంతో పోలీసులు అతడిని పట్టుకున్నారు. అనంతరం కోర్టులో అతడిని హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలుశిక్ష విధించారు. దీంతో అతడిని జిల్లా జైలుకు తరలించామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.


మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంతోష్‌కుమార్

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని మేడిపల్లి అటవీ శివారులో జరిగిన అమీనాబేగం అనే మహిళ హత్యకేసులో నిందితుడు కేతావత్ పీరాజీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. పీరాజీ మేడిపల్లి గ్రామ పరిసరాల్లో తిరుగుతుండగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చామన్నారు. అతడిని విచారించగా అమీనా బేగంపై దాడి చేసినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. మహిళపై దాడి చేసిన కర్రను స్వాధీనం చేసుకొని పీరాజీని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. గాంధారి ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

బంగారం దుకాణంలో చోరీ



సీసీ ఫుటేజీలో రికార్డయిన దుండగుడి కదలికలు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ఉన్న ఓ బంగారం దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రంలోని బంగారు దుకాణాన్ని మంగళవారం ఉదయం నిర్వాహకులు తెరచి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. గుర్తుతెలియని దుండగుడు సోమవారం అర్ధరాత్రి దుకాణం వెనుక ఉన్న తలుపులు పగలగొట్టి లోపలికి చొరబడి సొత్తును దొంగిలించినట్లు తెలిపారు. సుమారుగా 17కిలోల వెండి, 6తులాల బంగారం చోరీ చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఆలయంలో చోరీకి విఫలయత్నం



హుండీని పరిశీలిస్తున్న పోలీసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట పోలీస్ స్టేషన్ సమీపంలోని రేణుకామాత ఆలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. ఆలయంలోని హుండీని పగులగొట్టేందుకు వారు ప్రయత్నించినప్పటికీ హుండీ తలుపు తెరుచుకోకపోవడంతో దుండగులు వెనుదిరిగారు. మంగళవారం ఉదయం ఆలయాన్ని శుభ్రపర్చేందుకు వచ్చినవారు హుండీ తలుపు ధ్వంసమై ఉండడాన్ని గమనించి ఆలయకమిటీ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఆలయకమిటీ సభ్యులు అక్కడికి చేరుకొని, నాగిరెడ్డిపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆలయానికి చేరుకొని హుండీని పరిశీలించి, వివరాలు సేకరించారు.

ఇద్దరు బాలుర ఆచూకీ లభ్యం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బీర్కూర్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాల/హాస్టల్ నుంచి అదృశ్యమైన ఇద్దరి విద్యార్థుల ఆచూకీ లభ్యమైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు 18 గంటల వ్యవధిలోనే ఛేదించారు. పాఠశాలకు చెందిన ఇద్దరు ఎనిమిదో తరగతి విద్యార్థులు కిష్టాపూర్ నుంచి కామారెడ్డి వెళ్లారు. అక్కడి నుంచి నిజామాబాద్ చేరుకున్నారు. నిజామాబాద్ బస్టాండ్‌లో నిద్ర చేసి బాన్సువాడ వెళ్లారు. అక్కడి నుంచి కిష్టాపూర్‌కు రావడంతో పోలీసులు పట్టుకున్నారు. విద్యార్థులను పట్టుకోవడానికి అన్ని సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించామని పోలీసులు తెలిపారు. విద్యార్థులను పట్టుకోవడంతో సిబ్బందిని ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవీపేట: నవీపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఎస్సై వినయ్ తెలిపిన వివరాలు ఇలా.. కర్నూలు జిల్లాలోని కోయిలకుంట్ల మండల కేంద్రానికి చెందిన షేక్ ఇక్బాల్ హుసేన్ పాషా ఉపాధి నిమిత్తం నవీపేట మండలానికి వచ్చాడు. మండలంలోని బినోల క్రషర్‌లో అతడు బ్లాస్టర్‌గా పనిచేసేవాడు. మంగళవారం ఉదయం అతడు వాకింగ్‌కు వెళ్లివస్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న మినీట్రక్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య షేక్ షాహీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.